క్లుప్తంగా

విచారణ అధికారిణిగా సరళకుమారి


జాలిపూడి పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న సరళకుమారి

ఏలూరు రూరల్: ఏలూరు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి జాలిపూడి పంచాయతీ విచారణ అధికారిణిగా నియమితులయ్యారు. పంచాయతీ నిధులు ఉపయోగంలో అవకతవకలు జరిగాయని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కోడిచుక్కల నాగశేషు గత వారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు విచారణ చేపట్టాలని జిల్లా పంచాయతీ ఉన్నతధికారి సరళకుమారిని ఆదేశించారు. మంగళవారం ఆమె పంచాయతీ కార్యదర్శి కుమార్‌ను పిలిచి రికార్డులన్నీ సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండురోజుల్లో ఆమె గ్రామ పంచాయతీకి చేరుకుని రికార్డులు పరిశీలించనున్నారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక వేసవి శిక్షణ శిబిరం నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప, సహాయకురాలు బట్టు మణి తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుక్కునూరు: నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేను వెంకటాపురం గ్రామస్తులు కలిసి పోడు భూముల సమస్యను వివరించారు. దీంతో బాలరాజు అమరవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. నిర్వాసితులు పోడు భూములకు పట్టాలు కావాలని కోరడం లేదని పోలవరం ప్యాకేజీ ఇచ్చి తరలించే వరకు పోడు భూములను సాగు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని వివరించారు. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించి నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించే వరకు సాగు చేసుకునే పోడు భూముల జోలికి వెళ్లొద్దని అటవీ శాఖాధికారులను ఆదేశించారు. కుక్కునూరు–బూర్గంపాడు ఆర్‌అండ్‌బీ రహదారి గోతులతో ప్రయాణించేందుకు వీలులేకుండా ఉందని, మెడికల్ ఎమర్జెన్సీ వస్తే ప్రాణాలు గాల్లో దీపాలుగా మారయంటూ స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణ పనుల జాప్యం విషయమై బాలరాజు మండలానికి వచ్చిన ఆర్‌అండ్‌బీ డీఈ హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. హెడ్ ఆఫ్ ద అకౌంట్ విషయమై ఆర్థిక శాఖలో సమస్యలుండడం కారణంగా నిర్మాణ పనులు నిలిచాయని డీఈ వివరించారు. అనంతరం ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, వైఎస్ ఎంపీపీ తాండ్ర రాజేష్ ఇంటికి వెళ్లి రమణారెడ్డి కుమార్తె రక్షితా రెడ్డి దంపతులను, రాజేష్ కుమార్తె లారిసను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైఎస్ ఎంపీపీ గాడిద రామచంద్రం,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, నాయకులు రావు వినోద్, చిన్న నరసింహరాజు, పోలగాని వెంకట్రావు, ఎల్లంకి లక్ష్మణ్ రావు, నకిరికంటి నరసింహరావు, ఆచంట మాధవరావు, కోటగిరి ప్రజ్వల్ కుమార్, సర్వా శ్రీహరి, సర్పంచ్ తుర్సం నరేష్ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కుకునూరు: రోడ్డు ప్రమాదంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. కుకునూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీను గౌడ్ అశ్వారావుపేట నుంచి తన వాహనంలో కుకునూరుకు వస్తుండగా, నందిపాడు వద్ద గోతిని తప్పించే క్రమంలో వాహనాన్ని చెట్టుకు ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీనును 108 వాహనంలో కుకునూరుకు, అనంతరం భద్రాచలం తరలించారు.


ఈతకొడుతున్న బాలిక


ఈతకొడుతున్న బాలుడు


ఈతలో మెళకువలు నేర్చుకుంటున్న చిన్నారులు

సందడిగా స్విమ్మింగ్ పూల్

- శిక్షణ పొందుతున్న చిన్నారులు
- సేద తీరుతున్న పెద్దలు


ఏలూరు స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులకు ఈత నేర్పిస్తున్న కోచ్

ఏలూరు రూరల్ : స్థానిక విశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్‌పూల్ పిల్లలు, పెద్దలకు వేసవి విడిదిగా మారింది. పెరుగుతోన్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో సేద తీరేందుకు పెద్దలు, వేసవి సెలవులు రావడంతో ఈత నేర్చుకునేందుకు పిల్లలు స్విమ్మింగ్ పూల్‌కు క్యూ కడుతున్నారు. దీంతో పిల్లలు, పెద్దలతో పూల్ సందడిగా మారింది.

మహిళల ఆసక్తి

స్విమ్మింగ్ పూల్‌కు జనసందడి పెరగడంతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు సమయపాలన, ఫీజు నిర్ణయించారు. రోజుకు గంట చొప్పున ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పిల్లలు, పెద్దలకు సమయం కేటాయించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు మహిళలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. దీంతో ఉన్నత వర్గానికి చెందిన మహిళలతో పాటు ఉద్యోగినిలు సైతం స్విమ్మింగ్ పూల్ వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రత్యేక ఫీజులు

స్విమ్మింగ్ సాధన చేసేవారికి అధికారులు ప్రత్యేక ఫీజులు నిర్ణయించారు. 7 నుంచి 15 ఏళ్లలోపు వారికి అడ్మిషన్ ఫీజు రూ.1000, నెల ఫీజు రూ.700 చెల్లించాలి. 15 ఏళ్ల నుంచి 24 ఏళ్లలోపు వారికి అడ్మిషన్ ఫీజు రూ.2000, నెల ఫీజు రూ.1100 చెల్లించాలి. 25 ఏళ్ల పైబడిన వారికి అడ్మిషన్ రూ.2000, నెల ఫీజు రూ.1200లుగా నిర్ణయించారు. ఒక గంట పాటు స్విమ్మింగ్ చేయాలనే ఆసక్తి గల పెద్దలు రూ.200, పిల్లలు రూ.150 ప్రత్యేక రుసుం చెల్లించిన వారికి అనుమతి ఇస్తారు.

జిమ్, బాత్, డ్రెసింగ్

స్విమ్మింగ్ పూల్ హాలులో అధికారులు జిమ్, బాత్‌రూం సైతం అందుబాటులో ఉంచారు. మహిళలు, పురుషులు స్విమ్మింగ్ చేయడానికి ముందు జిమ్‌లో కొంత సమయం సాధన చేయవచ్చు. బాత్‌రూం ఉపయోగించుకున్న తర్వాత పూల్‌లో సేద తీరవచ్చు.

ద్రావకాలతో నీటి శుద్ధి

స్విమ్మింగ్ పూల్‌లో నీటిని సిబ్బంది ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ద్రావకాలను నీటిలో కలిపి క్రిమ కీటకాలను నివారిస్తున్నారు. పూల్ అడుగు భాగంలో నాచు, మట్టి, చేరకుండా శుభ్రం చేస్తున్నారు. క్రమం తప్పకుండా నీటిని మార్చుతూ కొత్త నీటితో స్విమ్మింగ్‌పూల్ శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక శిక్షణ

పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో అధికారులు పిల్లల కోసం మే 5వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. సీనియర్ స్విమ్మింగ్ కోచ్ గణేష్ ద్వారా నెలరోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన చిన్నారులకు ముగింపు రోజున సర్టిఫికెట్స్ అందజేయనున్నారు. కొన్నేళ్ల క్రితం ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. గతేడాది విజయవాడలో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి సీనియర్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న ఏలూరుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాల సాధించారు.

ప్రత్యేక శిక్షణ, పర్యవేక్షణ



స్విమ్మింగ్ నేర్చుకునే వారిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. నిర్ణయించిన ఫీజు చెల్లించిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. పూల్‌లో దిగేముందు తప్పనిసరిగా స్విమ్ సూట్ ధరించాలి. స్విమ్మర్ల సౌలభ్యం కోసం పురుషులు, స్త్రీలకు వేరువేరుగా సమయపాలన నిర్ణయించాం. జిమ్ సైతం అందుబాటులో ఉంది.

– గణేష్, స్విమ్మింగ్ కోచ్

20న సాయి మందిర్ వార్షికోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక మోతేవారి తోటలోని శ్రీ సాయిమందిర్ ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు మందిర కమిటీ ప్రతినిధి పెదపాటి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సాయినాథునికి అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రసిద్ధ కవులు రచించిన సాయి రాగమాలిక పుస్తకావిష్కరణ, 11.30 గంటలకు శ్రీ సాయి భక్తి గీతాల ఆలపన, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటలకు సత్యసాయిబాబా వారి నామసంకీర్తనలు ఆలపిస్తారని వివరించారు.

ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత


చాటపర్రులో లబ్ధిదారుడుతో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్: పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మొదట ప్రాధాన్యత ఇస్తోందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన చాటపర్రు జగనన్నకాలనీలో నిర్మాణ పనులు పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకుని, అధికారులకు ఆదేశాలిచ్చారు. గ్రామంలో మొత్తంగా 232 మంది పేదలకు స్థలాలు అందించామన్నారు. ఇందులో 134 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారని చెప్పారు. మరో 98 మంది ఇంటి పనులు ప్రారంభించారని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఇసుక, ఐరన్, సిమెంట్ అందిస్తున్నామన్నారు. పూర్తి చేసిన ఇళ్లకు హౌసింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తోందని తెలిపారు. కంకర రోడ్లు నిర్మించామని, విద్యుత్, నీటి వసతి కల్పించామని వివరించారు.

వాకర్ల సేవా దృక్పథం అభినందనీయం


గ్లూకోజ్ లిక్విడ్, కూలింగ్ వాటర్ పంపిణీ చేస్తున్న మహిళా వాకర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు మహిళా వాకర్లు ముందుకురావడం అభినందనీయమని వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు ఎస్ జగదీషన్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వివిధ క్రీడలు ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులతో పాటు పలువురు వాకర్స్‌కు వేసవి దృష్ట్యా దాహార్తి తీర్చేందుకు మహిళా వాకర్లు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జగదీషన్ ప్రారంభించారు. ఆరోగ్య కార్యక్రమాలు, కుటుంబాన్ని చక్కదిద్దే పనితో పాటు మహిళలు సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకు రావడం స్ఫూర్తివంతంగా ఉంటుందని ఆయన అన్నారు. మహిళా వాకర్స్ అధ్యక్షురాలు టి.మేరీ మాణిక్యమ్మ మాట్లాడుతూ మహిళా వాకర్ల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ ప్రయత్నానికి అనేక మంది మద్దతుగా నిలవడం తమకు మరింత ప్రోత్సాహాన్నిస్తోందని కృతజ్ఞతలు తెలిపారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా క్రీడాకారులకు, వాకర్లకు టాటా గ్లూకోజ్ లిక్విడ్ పంపిణీ చేశారు. కూలింగ్ వాటర్ క్యాన్లను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్‌సీఎస్‌ఎం అక్బర్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి విఘ్నేష్, ఏఎస్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతు

ఏలూరు రూరల్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని ఇఫ్టూ, పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఢిల్లీలో ఆందోళన చేస్తోన్న రెజ్లర్లకు మద్దతుగా మంగళవారం మహిళ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇఫ్టూ నాయకులు యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న మహిళ రెజ్లర్ల సమస్యను ప్రధానమంత్రి పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. మోదీ – షా ద్వయం బీజేపీ ఎంపీని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని బద్దా వెంకట్రావు ఆరోపించారు. సుప్రీంకోర్టు కల్పించుకుని దోషులను అరెస్ట్ చేయాలని ఆదేశించేంత వరకు కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ నాయకులు కె.నాని దుయ్యబట్టారు. కాకర్ల అప్పారావు, యర్రా శ్రీనివాసరావు, మంగం అప్పారావు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో 11వ తరగతికి దరఖాస్తులు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో (సీబీఎస్‌ఈ) ఎంపీసీ, బైపీసీల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. 10వ తరగతిలో 60 శాతంతో ఉత్తీర్ణులైన విద్యార్థులు మార్కుల జాబితాతో కేంద్రీయ విద్యాలయ కార్యాలయంలో ఈ నెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

యాప్‌ల నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలి

దెందులూరు: అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఆధార్ల అప్‌డేట్, యాప్‌ల నిర్వహణపై అత్యంత శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ భీమడోలు ప్రాజెక్టు ఆఫీసర్ కె.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం దెందులూరు బాలసదనంలో సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో దెందులూరు సెక్టార్ పరిధిలో79 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ప్రాజెక్ట్ మీట్ నిర్వహించారు. కేంద్రానికి సంబంధించి రికార్డుల నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల ప్రణాళిక, యాప్‌లు, ఆధార్‌లు, ఇతర విషయాలపై సీడీపీఓ, సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు సమన్వయంతో సేవలందిస్తేనే లబ్ధిదారులకు మంచి జరుగుతుందన్నారు.

హనుమాన్ చాలీసాలో పాల్గొన్న ఎమ్మెల్యే


హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దేవునిపై విశ్వాసం, నిరంతర పూజలతో సర్వం సాధ్యపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం శ్రీరామవరం గ్రామంలో కామిరెడ్డి బాలు నివాసంలో హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం జరిగింది. తొలుత ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, విజిలెన్స్ అడ్వైజరీ బోర్డు సభ్యులు కత్తుల రవి, నాయకులు అక్కినేని శ్రీనివాసరావు, కామిరెడ్డి ప్రతాప్, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్న సమారాధన

ఉంగుటూరు: ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా మంగళవారం ఆయా ఆలయాల వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఉంగుటూరు పడమర కాలువగట్టుపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ వానపల్లి ప్రసాదు, సభ్యులు పర్యవేక్షించారు. జాతీయ రహదారిని ఆనుకుని చేబ్రోలు–కైకరం మధ్య కాలువ గట్టుపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ పర్యవేక్షులు మంత్రాల సుబ్బారాయుడు పర్యవేక్షించారు.

చెరువులో చనిపోయిన చేపల తొలగింపు

ద్వారకాతిరుమల: చెరువులో చనిపోతున్న చేపల నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేక పోతున్నామంటూ మండలంలోని వేంపాడు గ్రామస్తులు మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఎస్సై టి.సుధీర్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించడంతో వివాదం సద్దుమణిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. గ్రామంలోని ఊరచెరువులో చేపల పెంపకం జరుగుతోంది. నాలుగు రోజుల నుంచి అందులోని చేపలు చనిపోతున్నాయి. వాటిని బయటకు తీయకుండా చెరువులోనే విడిచిపెట్టడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు ఆ చెరువు వద్ద నిత్యం 150 మంది వరకు కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. దీంతో దుర్వాసనను భరించలేక పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు కూలీలు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో కొందరు ఉపాధి కూలీలు దీనిపై ఏలూరు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం చెరువు వద్దకు మంగళవారం అధికారులు వస్తారని ఉపాధి కూలీలు, గ్రామస్తులు ఉదయం నుంచి చెరువు వద్దే ఉన్నారు. ఎంతకీ అధికారులు రాకపోవడంతో వారు చెరువు వద్దే ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్సై సుధీర్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. చనిపోయిన చేపలను పంచాయతీ అధికారులు బయటకు తీయించే పనిలో పడ్డారు.

ఇత్తడి తాపడం పనులు

కొయ్యలగూడెం: స్థానిక నూతన రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభానికి ఇత్తడి తాపడం పనులు ప్రారంభించారు. పీఠంతో సహా 50 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించిన సోము కర్రకు 260 కేజీల ఇత్తడిని రేకులుగా తయారు చేశారు. ఇత్తడి తాపడం వల్ల ధ్వజ స్తంభం దీర్ఘకాలం మన్నిక ఉంటుందని, భక్తులు 180 కేజీల తమ ఇంటిలోని పాత ఇత్తడిని కానుకలుగా సమర్పించారు. మిగిలిన 80 కేజీలను దేవస్థానం ఖర్చుతో సిద్ధం చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి తెలిపారు. దాదాపు రెండు 250 ఏళ్ల ప్రాశస్త్యం గల మదన గోపాలస్వామి ఆలయం పునః ప్రారంభోత్సవం ఇటీవల నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిరువూరి శ్రీనివాస్, కె.వీరభద్రరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


గోపన్నపాలెంలో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: డెంగీ వ్యాధి దోమ పగటిపూట మాత్రమే కుడుతుందని, డెంగీకి నివారణే ముఖ్యమని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిని రోజాలలిత అన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఫ్లెక్సీలు చేతపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యాధికారి మాట్లాడుతూ డెంగ్యూ సోకిన వ్యక్తి ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. కొబ్బరి బొండాలు, ఖాళీ ప్లాస్టిక్ టీ కప్పులు, ఉపయోగం లేని వాహనాలు, టైర్లల్లో ఈ దోమ గుడ్లు పెడుతుందన్నారు. వైద్యశాఖ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహిస్తున్నామని, ఆరోగ్య శాఖ సలహాలు, సూచనలు పాటించాలని వ్యాధికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నాగరాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి శ్రీదేవి శత చండీయాగం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి త్రిశక్త్యాత్మిక శ్రీదేవి శత చండీ యాగ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు, అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానంద శర్మ తెలిపారు. ఈ నెల 18న లక్ష గరిక పూజ, 19న విశేష అభిషేకాలు, లక్ష కుంకుమార్చనలు, 20న సంపూర్ణ నవగ్రహ శాంతి 21న అర్ఘ్య ప్రదానం, 108 శక్తి పీఠాల్లో వేంచేసిన అమ్మవార్ల పేర్లతో 108 మంది ముత్తైదువులకు తాంబూలాలు, వాయినాలు ఇస్తారని, 22న అష్టోత్తర శత కలశాలభిషేకం, మహాపూర్ణాహుతి, 23న సారి మహోత్సవం, 24న శ్రీ గంగా, కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి వారికి, 101 మంది అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. 28న ఉత్సవాల ముగింపు సందర్భంగా మహా అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం పూజలు, హోమాలు, ఊరేగింపులు, కల్యాణ మహోత్సవాలు, హోమాలు నిర్వహిస్తారని వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	10

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	10
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	17
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	17

చిన్నతిరుపతికి చేరిన సైకిల్ యాత్రికుడు


శ్రీవారి క్షేత్రానికి సైకిల్ యాత్రగా వచ్చిన గోపాలకృష్ణ

ద్వారకాతిరుమల: దేశ శాంతి, జల, జంతు, వన సంరక్షణ కోరుతూ కర్నాటక రాష్ట్రం, రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన చాట్రాజుల విజయ గోపాలకృష్ణ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి చేరుకుంది. గతేడాది మార్చి 11న సింధనూరులో ప్రారంభమైన ఈ దైవదర్శన సైకిల్ యాత్ర యానాం కేంద్ర పాలిత ప్రాంతంతో పాటు 15 రాష్ట్రాలను చుట్టిముట్టి ఇప్పుడు చిన్నతిరుపతికి చేరింది. పూరీలోని జగన్నాథుని ఆలయం నుంచి బయల్దేరి తాను మార్గ మధ్యలోని పలు ఆలయాలను సందర్శిస్తూ ఇక్కడికి వచ్చినట్టు గోపాలకృష్ణ తెలిపారు. కాశీ నుంచి రామేశ్వరం వరకు తన యాత్ర సాగుతుందని, ఇప్పటి వరకు 15 రాష్ట్రాల్లో దైవ దర్శనాలు, 11 నదుల్లో పుణ్య స్నానాలు ఆచరించినట్టు పేర్కొన్నారు. బుధవారం ఉదయం చినవెంకన్నను దర్శించిన తరువాత ఇక్కడి నుంచి బయల్దేరి భద్రాచలం వెళతానని తెలిపారు. తన సొంతూరు తణుకు మండలం కొమ్మరవరమని, చిన్నతనంలోనే వ్యవసాయం రీత్యా కర్ణాటకలోని సింధనూరుకు వెళ్లి అక్కడ స్థిరపడినట్టు చెప్పారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో హనుమజ్జయంతి సహిత కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉపాలయంలో కొలువై ఉన్న అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆలయంలో పూజలు అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. వార్షికోత్సవ వేడుకలు 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం ఆలయంలో గణపతిపూజతో కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు పరిమి వెంకట్రావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా అందించినట్లు తెలిపారు.